క్లుప్తంగా

ప్రత్యేక మండలంగా గుర్తించాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లోవముఠా ప్రాంతం పరిధిలోని 10 గ్రామ పంచాయతీలను కలిపి ఓ ప్రత్యేక మండలంగా గుర్తించాలని బీజేపీ నాయకుడు నిమ్మక సింహాచలం ఓ ప్రకటనలో గురువారం కోరారు. ఆయా పంచాయతీల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తోందని, దీంతో వారు ఎంతగానో వ్యయప్రయాసలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రత్యేక మండలం ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేకాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి


పత్ర-పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి గురువారం పత్ర–పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ముడుపుల పూజలు ఘనంగా జరిగాయి. తెల్లవారు జామున 4 గంటల నుంచి భక్తులు పూజా సామగ్రితో వచ్చి స్వామిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకూ క్యూలో ఉన్నారు. ఆలయప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో స్వామివారికి అర్చకులు, భక్తులతో ప్రత్యేక అలంకరణ చేశారు.

గాలికి వదిలేసిన అర్బన్ హెల్త్ సెంటర్


నిర్మాణం పూర్తయిన బెలగాం అర్బన్ హెల్త్‌సెంటర్

పార్వతీపురం టౌన్: గత ప్రభుత్వంలో రూ.84 లక్షల అంచనా వ్యయంతో పార్వతీపురం పట్టణంలో బెలగాం అర్బన్ హెల్త్ సెంటర్‌ను పూర్తి చేశారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం 100 రోజులు గడుస్తున్నప్పటికీ ఈ భవనాన్ని ప్రారంభించకుండా వదిలేసింది. పట్టణ ప్రజల ఆరోగ్య అవసరాల నిమిత్తం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన భవనాన్ని పేదలకు అందుబాటులోకి తీసుకురాకపోవడంతో పట్టణంలో చర్చ సాగుతోంది. పంతాలు పక్కనపెట్టి ఈ భవనాన్ని ప్రజావసరాల నిమిత్తం ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


అధ్వానంగా మక్కువ బైపాస్ రోడ్డు

సాలూరు రూరల్: పట్టణంలోని మక్కువ బైపాస్ రోడ్డు చివరలో పెద్దగొయ్యి వాహన చోదకులకు ప్రమాదకరంగా మారింది. బైపాస్ రోడ్డుపై ప్రయాణించే వారు బీటీ రోడ్డు చివరికి చేరేసరికి అకస్మాత్తుగా ఈ గొయ్యి దర్శనమిస్తుంది. దీంతో వాహన చోదకులు సడన్ బ్రేక్ వేయడంతో ఈ గొయ్యివద్ద పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. బీటీ రోడ్డు సీసీ రోడ్డు కలిసే దగ్గర ఏర్పడిన గొయ్యి రోడ్డుకు అడ్డంగా ఒక గట్టులా ఉండడంతో వాహన చోదకులకు ప్రమాదకరంగా మారింది. వెంటనే మున్సిపల్ అధికారులు ఈ గొయ్యిని కప్పి ప్రమాదాలను నివారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

బహుమతుల అందజేత

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా ముగ్గులు, ఆట పాటల పోటీలు నిర్వహించారు. వాటిలో గెలుపొందిన వారికి ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహన రావు బహుమతులను గురువారం అందజేశారు. ఇంటింటా వేసిన రంగుల ముగ్గులను పరిశీలించి సంస్కృతి, సంప్రదాయాలను సూచించే ముగ్గులకు ప్రాధాన్యం ఇచ్చారు. కనుమ నాడు పిల్లలకు ఆటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు.పెద్దవారు కూడా వారి బాల్య స్మృతులను గుర్తు చేసుకుంటూ సరదాగా ఆడిపాడారు. పండగలు మనలో ఉత్సాహాన్ని నింపుతూ మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని డాక్టర్ జగన్‌మోహన్ రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ హేమాక్షి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైరస్‌లతో శ్వాసకోశ సమస్యలు..

- ముందస్తు కట్టడి చర్యలు అవసరం
- రోగ నిరోధక శక్తిని పెంచుకుంటే వైరస్ తీవ్రత అధిగమించవచ్చు
- పౌష్టికాహారంతో మేలు


ఏరియా ఆస్పత్రిలో చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్

పాలకొండ రూరల్: అన్ని వర్గాల ప్రజలను చివురుటాకులా వణికించిన కోవిడ్ –19 (కరోనా) సమస్య నుంచి ఉపశమనం పొందిన కొద్ది కాలంలో అదే తరహా మరో వైరస్ హ్యూమన్ మెటన్యూమో (హెచ్‌ఎంపీవీ) ఇటీవల తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో శీతాకాలంలో విజృంభించే ప్రాణాంతక వైరస్‌లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వ్యాధినిరోధక శక్తిని పెంపొందించుకోవడమే మన ముందున్న చక్కటి మార్గమని వైద్యులు చెబుతున్నారు. రోగం వస్తుందన్న భావనతో ప్రతిఒక్కరూ సంబంధిత మందులు ప్రచార మాధ్యమాల ద్వారా తెలుసుకుని వాడుతుంటారు. అయితే ఇది సరైన పద్ధతి కాదని వైద్యులు చెబుతున్నారు. ముందుగా వ్యాధి కారక వైరస్ అంటే ఏమిటి.. దాని లక్షణాలు ఎలా ఉంటాయన్న విషయాలపై అవగాహన పెంచుకోవాలి. సమస్యలు తలెత్తితే వైద్యుల పర్యవేక్షణ, సూచనలు లేకుండా మందులు వాడకూడదని స్పష్టం చేస్తున్నారు. హానికారక వైరస్‌లు అధిగమించేందుకు ఇమ్యూనిటీని పెంచే ఆహారం ద్వారా లబ్ధి పొందవచ్చునని చెబుతున్నారు.

హెచ్‌ఎంపీవీ లక్షణాలు...

కోవిడ్ తరహాలో హెచ్‌ఎంపీవీ వైరస్‌పై చర్చ జరిగింది. ఈ ముఖ్యంగాహెచ్‌ఎంపీవీ కారణంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ముక్కు కారడం, దగ్గు, జ్వరంతో పాటు గొంతునొప్పి లక్షణాలుంటాయి. సమస్య తీవ్రమైతే నిమోనియా, బ్రాంకైటీస్‌కు దారి తీస్తుంది. ప్రస్తుత శీతాకాల సీజన్ (చల్లని వాతావరణం) వైరస్‌ల వ్యాప్తికి అనుకూలం కావడంతో చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు సమస్యల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికే వ్యాధి లక్షణాలను సమీప రాష్ట్రాల్లో గుర్తించడం జరిగింది. పండగల తరుణంలో ఇతర ప్రాంతాల్లో బంధువులు, ఇతరులు స్వగ్రామాల్లోకి వస్తుంటారు. ఈ క్రమంలో జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. తుమ్ము, దగ్గు కారణంగా వెలువడే తుంపర్ల నుంచి, వ్యాధిగ్రస్తులతో సన్నిహితంగా ఉన్నవారి నుంచి వైరస్ ఇతరులకు వ్యాపిస్తుంది. ఈ నేపథ్యంలో స్వీయ నియంత్రణ ముఖ్యం. జన సమూహాల్లో తిరగకుండా ఉండడం, మాస్కులు ధరించడంతో పాటు చేతులు ఎప్పటికప్పుడు క్లినికల్, ఇతర సబ్బులతో శుభ్రం చేసుకోవడం మంచింది. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. శానిటైజర్లను వినియోగించాలి.

రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాలు...

నిత్యం మనం ఆరగించే ఆహారంలో పప్పు, గోరుచిక్కుడు, బల్ల చిక్కుళ్లు, బీన్స్, దోసకాయ, తాజా కాయగూరలు ఉండేలా చూడాలి. కొవ్వు లేని చికెన్, మటన్, ఉడికించిన గుడ్డు వంటివి తినడం వల్ల వ్యాధి నిరోధకశక్తిని (ఇమ్యూనిటి) పెంపొందించుకోవచ్చు. అదేవిధంగా (విటమిన్–సి) పుష్కలంగా దొరకే ఉసిరి, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, ఆరంజ్, మామిడి పళ్లు తీసుకోవడం మంచిది. వీటితో పాటు ఖర్జూరం, బాదంపప్పు, జీడిపప్పు, కిస్మిస్, ఆరటిపళ్లు, ఇతర డ్రైఫ్రూట్స్ తినడం మంచిది. దీని వల్ల (ఆక్సిజ్ లెవెల్స్, ఐరన్) పెంపొందించుకోవచ్చు. నివాస ప్రాంతాల్లోకి వెలుతురు, గాలి ధారాళంగా వచ్చేలా చూసుకోవాలి. సూర్యరశ్మి తగలడం వల్లన (విటమిన్–డి) పుష్కలంగా లభిస్తుంది. శరీరంలో నీటినిల్వలు తగ్గిపోకుండా ఉండేందుకు సగటున రోజులో 4 లీటర్ల నీటిని వేడిచేసి చల్లార్చి తాగాలి. ఉదయం పూట క్రమంతప్పకుండా తేలికపాటి వ్యాయామాలు, నడక, యోగా వంటివి చేయడం వల్లన ఒత్తిళ్లను అధిగమించడంతో పాటు మనోధైర్యం కూడగట్టుకోవచ్చు. రాత్రి సమయంలో తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడంతో పాటు పాలు తాగడం వల్ల నిద్రలేమి నుంచి ఉపశమనం పొందవచ్చు.

స్వీయరక్షణ అవసరం..



ప్రస్తుత వైరస్ అంత ప్రమాదకం కాదు. అయినా జాగ్రత్తలు తప్పనిసరి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి ద్వారా సులభంగా వైరస్‌లు వ్యాపించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వ్యక్తిగత భద్రతతో సమస్యల తీవ్రత అధిగమించవచ్చు. శరీరానికి ఇమ్యూనిటీ సమకూరే ఆహారం తీసుకోవాలి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలను చైతన్యపరుస్తున్నాం. చిన్నారులు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నావారు జాగ్రత్తలు తీసుకోవాలి. ముందస్తు చర్యల్లో భాగంగా ఏరియా ఆస్పత్రిలో రెండు వందల ఆక్సిజన్ సిలిండర్లు, పది పడకలతో కూడిన ప్రత్యేక ఐసీయూ విభాగం సిద్ధం చేశాం. ప్రజలు అపోహలు వీడి అవగాహన పెంచుకోవాలి. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించి అవసరమైన మందులు వాడాలి.

– డాక్టర్ జి.నాగభూషణరావు, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, పాలకొండ

'సూపర్ సిక్స్' అమలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేత చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు విమర్శించారు. ఇదే విషయమై మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. సమస్య ఎక్కడుంటే అక్కడికి నేనే వస్తా.. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అని సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో చెప్పారని, అప్పుడు ఆయన ఆడిన మాటలకు ఇప్పుడు చేస్తున్న పనులకు పొంతన లేదని దుయ్యబట్టారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఉపాధి లేక ఉద్యోగాకావశాలు కల్పిస్తామన్నారని, మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తానని చెప్పారని, రైతులకు వ్యవసాయ పెట్టుబడికి రూ.20 వేల ఆర్థికసాయం, చదువుకున్న ప్రతీ బిడ్డకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నారని.. అవేవీ ఇప్పుడు అమలు చేయలేదన్నారు. తెలంగాణలో ఆరు సంక్షేమ పథకాల హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లో హామీలు అమలు చేసి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అదే తరహాలో ఇక్కడి చంద్రబాబు ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలు తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు.

అభివృద్ధికి నోచుకోని చింతమానుగూడ


కనీసం సీసీ రోడ్డు లేని చింతమానుగూడ గిరిజన గ్రామం


శిథిలావస్థలో గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారుతున్నా.. మండలంలోని కుక్కిడి గ్రామ పంచాయతీ, చింతమానుగూడ గిరిజన గ్రామం మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. 20 సవర గిరిజన కుటుంబాల్లో 200 మంది వరకు జనాభా కలిగి ఈ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో కనీస సదుపాయాలు లేక కొట్టుమిట్టాడుతోంది. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని చాలా సమస్యలు గ్రామాన్ని వేధిస్తున్నాయి. చాలా ఏళ్లుగా అక్కడి వారంతా రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్, పక్కా ఇళ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇతర ప్రాంతాలను అనుసంధానిస్తూ గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో అటవీ ఉత్పత్తులను గ్రామానికి తీసుకువచ్చేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు బిడ్డిక వెంకటేష్, సాయిబాబు, దాసు, రామారావు, ధర్మారావు, సుబ్బారావులు వాపోతున్నారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సైతం పడిపోయే దశలో ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా జ్వరపీడితులు, గర్భిణులను ఆస్పత్రికి తరలించాలంటే మట్టి రోడ్డులో ఆపసోపాలు పడాల్సిందేనంటున్నారు. వర్షాకాలంలో ఆస్పత్రికి రోగుల తరలింపు చాలా కష్టమవుతోందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పర్యవేక్షణ లోపం


పట్టణ ప్రధాన రహదారిపై వెలుగుతున్న వీధి దీపాలు

పార్వతీపురం టౌన్: విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధిదీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పట్టణంలోని చాలా వార్డుల్లో, పట్టణ ప్రదాన రహదారిపై వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండడంతో వందలాది యూనిట్లు విద్యుత్ వృథా అవుతోంది. ఫలితంగా విద్యుత్‌శాఖ నిర్వాకంతో గ్రామ పంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రత్యేక లైన్‌లు వేసి ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రభుత్వం నిరంతరం విద్యుత్‌ను అందించడానికి వేల కోట్లు వెచ్చిస్తున్నా విద్యుత్‌ను ఆదా చేయాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ ఆదాయం, జనాభా మేరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయగా రాత్రి పూట ఆన్‌చేసి ఉదయం పూట ఆఫ్ చేయాలి. కానీ అలా జరగడం లేదు. దీంతో పట్టణంలో వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. అధికారులు స్పందించి గ్రామాల్లో వీధిలైట్లకు ప్రత్యేక లైన్ ఏర్పాటుచేసి ఆన్‌ఆఫ్ స్విచ్‌లను వేయాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అదే పాఠశాలలో గురువారం జరిగింది. 2005–06 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఒకరినొకరు కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుని, సరదాగా గడిపారు. అనంతరం స్నేహితుల్లో ఎవరికైనా ఆపద వస్తే సాయం చేయాలని అందరూ తీర్మానించారు. కార్యక్రమంలో ఎం.శంకరరావు, ఎన్.భాస్కరరావు, ఎన్.మహేశ్, పి.ఊర్మిళ, ఎస్.రమేష్, సీహెచ్ సరస్వతి, బి.శాంతి, ఎస్.లక్ష్మి, ఎస్.భారతి, పి.రాజేశ్వరి, బి.మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష రేపు

వీరఘట్టం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం నిర్వహించనున్నట్లు పరీక్ష కేంద్రం సూపరింటిండెంట్ గర్భాన శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో 249 విద్యార్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం పది గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలి

సాలూరు రూరల్: వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్‌టీసీ డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాలు డిపో మేనేజర్ ఎ.భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ రామకృష్ణ మాట్లాడుతూ వాహన చోదకులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. అతివేగం ప్రమాదాలకు కారణమని వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే జిల్లా డీపీటీఓ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్‌టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని సూచించారు.

మురుగు కాలువ కాదది.. వేగావతి నది

సాలూరు రూరల్: సాలూరు పట్టణానికి తాగునీరు అందిస్తున్న వేగావతి నదిని మురుగు కాలువలా మార్చేశారు. పట్టణ వాసులు వినియోగిస్తున్న మురుగునీటితో పాటు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో కలుస్తున్నాయి. మున్సిపాలిటీ ఏర్పాటు జరిగి అర్ధశతాబ్దం పైనే అయినా ఇప్పటికి మురుగునీరు పారే నదిలో కలవకుండా చర్యలు తీసుకోకపోవడంపై పట్టణ వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నా రు. పట్టణాన్ని ఆనుకుని పారే వేగావతి నది నీటినే దిగువనున్న శివరాంపురం తదితర గ్రామాల ప్రజలు వాడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


పాలిథిన్ వ్యర్థాలతో నిండిన వేగావతి నది ←

జనరేటర్ నుంచి మంటలు


జనరేటర్ నుంచి ఎగసిపడుతున్న మంటలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న జనరేటర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గురువారం జరిగిన ఈ ఘటనపై అప్రమత్తమైన సిబ్బంది, స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఎస్ఎన్‌సీయూకు అనుసంధానంగా ఉన్న జనరేటర్ ఆస్పత్రి బయట ఉండడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని అంతా అనుకుంటున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరావాల్సి ఉంది.

భద్రతకు తొలి ప్రాధాన్యం


సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎం వెంకటేశ్వరరావు

పాలకొండ రూరల్: ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులు, తమ వ్యక్తిగత భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలన్నారు. డిపో నుంచి బస్సు బయటకు తీసుకువెళ్లే ముందు గ్యారేజీలో వాహనం కండీషన్ పరిశీలించాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం.. ప్రయాణికులతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వచ్చే నెల 15వ వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంఎఫ్ జగన్నాథం, ఏడీసీలు బీకే మూర్తి, జగన్నాథం, డీపీఎస్ రాజు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

● విజేతలకు బహుమతులు..



సంక్రాంతి నేపథ్యంలో బత్తిలిలో ఇటీవల నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన టీమ్‌కు రూ. 16వేలు.. ద్వితీయ స్థానంలో నిలిచిన టీమ్‌కు రూ. 7,500 నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కిరణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు టింగ అన్నాజీరావు, టీచర్ మేరీ ప్రసాద్, అశోక్, విశ్వనాథ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

– భామిని

● గోపూజ...



ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ దేవస్థానంలో కార్యనిర్వాహణాధికారి వీవీ.సూర్యనారాయణ, అర్చకులు లక్ష్మీప్రసాదశర్మ, వేమకోటి మనీల్‌కుమార్ నేతృత్వంలో గురువారం సంప్రదాయబద్ధంగా గోపూజ చేపట్టారు. ముక్కనుమ రోజున అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ క్రమంలో పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా డూడూ బసవన్నల నృత్యాలు, హరిదాసుల గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. మండలంలోని అట్టలి కొండపై కొలువైన అమ్మవార్లకు గ్రామీణులు సంప్రదాయ మొక్కులు చెల్లించుకున్నారు.

– పాలకొండ రూరల్


● పూర్వ విద్యార్థుల కలయిక..



బూలేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004 – 05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి, గురుభక్తి చాటుకున్నారు. చిన్ననాటి సంఘటనలు గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరించాలని నిర్ణయించారు.

– భామిని

ఉచిత వైద్యసేవలు ప్రారంభం


రోగిని పరీక్షిస్తున్న కార్డియాలజిస్ట్ సూర్యప్రకాష్

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో హైదరాబాద్ కేర్ ఆస్పత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ గురువారం ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి, ఉచిత వైద్యసేవలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తాను ప్రారంభించిన ఈ కేంద్రంలో ఎప్పటికప్పుడు తాను గ్రామం వచ్చి, ప్రజలకు వైద్యం అందిస్తానన్నారు. ఈ సేవలకు ఉచితంగా ఇంటిని అందించిన గుంట్రెడ్డి శ్రీరాములునాయుడును ఆయన అభినందించారు. అనంతరం శిబిరానికి పలు ఆరోగ్య సమస్యలతో హాజరైన వారికి వైద్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు, ఆరోగ్య సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.